# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## జాతీయ వార్తలు

తేదీ: 15-02-2026 సమయం : రాత్రి 8గం. 30ని.లు

## ముఖ్యాంశాలు

- ఈ ఏడాది కేంద్ర బడ్జెట్.. భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా మార్చాలన్న ఆకాంక్షలను ప్రతిబింబిస్తుందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వ్యాఖ్యానించారు.

- అంతర్జాతీయ వాణిజ్య ఒప్పందాల్లో రైతు సంక్షేమమే ప్రధాన అజెండాగా ప్రభుత్వం పని చేస్తోందని కేంద్ర హోం మంత్రి అమిత్ షా పునరుద్ఘాటించారు.

- పట్టణ మౌలిక వసతులను అంతర్జాతీయ ప్రమాణాలతో తీర్చిదిద్దేందుకు లక్ష కోట్ల రూపాయలతో “అర్బన్ ఛాలెంజ్ ఫండ్” ఏర్పాటుకు కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది.

- పురుషుల టీ-20 ప్రపంచ కప్‌లో భాగంగా భారత్ - పాకిస్థాన్ జట్ల మధ్య కొలంబోలోని ఆర్.ప్రేమదాస స్టేడియం వేదికగా క్రికెట్ మ్యాచ్ జరుగుతోంది.

====================

ఈ ఏడాది కేంద్ర బడ్జెట్.. భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా మార్చాలన్న కోట్లాది మంది భారతీయుల ఆకాంక్షకు ప్రతిబింబమని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వ్యాఖ్యానించారు. ఒక వార్తా సంస్థకు ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో ప్రధాని బడ్జెట్ ప్రాధాన్యతను వివరించారు. ఈ బడ్జెట్ ‘ఇప్పుడే లేదా ఇంకెప్పటికీ కాదు’ అనే ఒత్తిడితో కూడిన నిర్ణయం కాదని స్పష్టం చేశారు. ఇది పూర్తి సన్నద్ధత, సరైన స్ఫూర్తితో కూడిన “మేం సిద్ధంగా ఉన్నాం” అనే ఆత్మవిశ్వాస ప్రకటన అని ఆయన పేర్కొన్నారు. అంతర్జాతీయ వాణిజ్య ఒప్పందాల గురించి ప్రధానమంత్రి ప్రస్తావిస్తూ.. దేశంలో నెలకొన్న రాజకీయ స్థిరత్వం, స్పష్టమైన విధానాల వల్ల భారత్‌పై పెట్టుబడిదారుల్లో నమ్మకం ఏర్పడిందన్నారు. బలమైన తయారీ, సేవలు, MSME రంగాల వల్ల భారత్ వాణిజ్య ఒప్పందాలలో ధైర్యంగా చర్చించగలుగుతోందని తెలిపారు. ముఖ్యంగా వస్త్ర, తోలు, రసాయనాలు, హస్తకళలు, రత్నాలు వంటి రంగాలకు ప్రపంచ మార్కెట్లలో అవకాశాలు కల్పించేలా స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలను రూపొందించినట్లు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వివరించారు.

====================

అంతర్జాతీయ వాణిజ్య ఒప్పందాల్లో రైతు సంక్షేమమే ప్రధాన అజెండాగా ప్రభుత్వం పని చేస్తోందని కేంద్ర హోం మంత్రి అమిత్ షా పునరుద్ఘాటించారు. రైతులు, పశుపోషకులు, మత్స్యకారుల ప్రయోజనాలకు ఎట్టి పరిస్థితుల్లోనూ విఘాతం కలగనీయబోమని ఆయన స్పష్టం చేశారు. గుజరాత్ రాజధాని గాంధీనగర్‌లో దేశంలోనే మొట్ట మొదటిసారిగా సెంట్రల్ బ్యాంక్ డిజిటల్ కరెన్సీ (CBDC) ఆధారిత ప్రజా పంపిణీ వ్యవస్థను (PDS) అమిత్ షా ఈరోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. CBDC ఆధారిత కొత్త టోకెన్ వ్యవస్థతో ప్రజా పంపిణీ వ్యవస్థలో అవినీతి నిర్మూలన సాధ్యపడుతుందని, పారదర్శకత పెరుగుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు. గత దశాబ్దంలో పేదల కోసం ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాల వలన 27 కోట్ల మంది పేదరికాన్ని అధిగమించగలిగారని అమిత్ షా పేర్కొంటూ...

(వాయిస్ 31 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = =

`ఇండియా ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్-2026`లో భాగంగా ఏర్పాటు చేసిన ఐదు రోజుల ప్రదర్శన `ఇండియా ఏఐ ఇంపాక్ట్ ఎక్స్‌పో`ను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ రేపు ప్రారంభించనున్నారు. ప్రపంచ వ్యాప్తంగా ఏఐ వినియోగం ఏ విధంగా సామాన్యుడి జీవితాన్ని మారుస్తుందో ఈ ప్రదర్శన కళ్లకు కట్టనుంది. ఈ ఎక్స్‌పోలో బ్రిటన్, జర్మనీ, ఫ్రాన్స్, రష్యా, జపాన్, ఆస్ట్రేలియా సహా 13 దేశాలకు చెందిన ప్రత్యేక పెవిలియన్లను ఏర్పాటు చేశారు. సుమారు 600కు పైగా అత్యున్నత సామర్థ్యం గల స్టార్టప్‌లు తాము అభివృద్ధి చేసిన ప్రపంచ స్థాయి పరిష్కారాలను ఇక్కడ ప్రదర్శించనున్నాయి.

= = = = = = = = = = = = = = = = = = = =

దేశ వ్యాప్తంగా మహా శివరాత్రి పర్వదినాన్ని భక్తులు ఘనంగా జరుపుకుంటున్నారు. శైవక్షేత్రాలన్నీ శివ నామస్మరణతో మారుమోగుతున్నాయి. మహాశివరాత్రి సందర్భంగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ఉపరాష్ట్రపతి సి.పి. రాధాకృష్ణన్, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దేశ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ పవిత్ర పర్వదినం ప్రజల జీవితాల్లో సుఖశాంతులు నింపాలని, భారత్ ప్రగతి పథంలో ముందుకు వెళ్లాలని రాష్ట్రపతి ఆకాంక్షించారు. కాశీ నుంచి రామేశ్వరం వరకు ఈ పండుగ భారత ఆధ్యాత్మిక సమగ్రతకు ప్రతీక అని ఉపరాష్ట్రపతి కొనియాడారు. శివుడి ఆశీస్సులతో దేశభివృద్ధి శిఖరాగ్రంలో నిలవాలని ప్రధానమంత్రి పేర్కొన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = =

అసోంలోని బ్రహ్మపుత్ర నది కింద దేశంలోనే మొట్టమొదటి `అండర్ వాటర్ ట్విన్ ట్యూబ్` రోడ్డు-రైలు సొరంగ మార్గ నిర్మాణానికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలోని ఆర్థిక వ్యవహారాల కేబినెట్ కమిటీ (CCEA) ఆమోదముద్ర వేసింది. ప్రపంచంలోనే రెండో 'అండర్ వాటర్ రోడ్-కమ్-రైల్' టన్నెల్‌గా ఇది రికార్డు సృష్టించనుంది. ఈ గ్రీన్‌ఫీల్డ్ ప్రాజెక్ట్ మొత్తం 33.7 కిలోమీటర్ల పొడవు కలిగి ఉంటుంది. ఇందులో 15.79 కిలోమీటర్ల ట్విన్ ట్యూబ్ టన్నెల్ బ్రహ్మపుత్ర నదికి అడుగున 18 వేల 662 కోట్ల రూపాయల వ్యయంతో నిర్మిస్తారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సోషల్ మీడియాలో స్పందిస్తూ... ఈ ప్రాజెక్ట్ ఈశాన్య ప్రాంత అభివృద్ధికి మైలురాయిగా నిలుస్తుందని పేర్కొన్నారు. కనెక్టివిటీ పెరిగి, లాజిస్టిక్స్ ఖర్చులు తగ్గి, ప్రాంతీయ వృద్ధి వేగవంతం అవుతుందని ప్రధానమంత్రి తెలిపారు.

విరామం

= = = = = = = = = = = = = = = = = = = =

జర్మనీలో జరుగుతున్న `మ్యూనిక్ భద్రతా సదస్సు 2026` (MSC) సందర్భంగా జీ-4 దేశాలు 'భారత్, జర్మనీ, జపాన్, బ్రెజిల్' ల విదేశాంగ మంత్రుల సమావేశం జరిగింది. భారత విదేశాంగ మంత్రి డాక్టర్ ఎస్. జైశంకర్ ఈ భేటీలో జీ-4 దేశాల మంత్రులతో చర్చలు జరిపారు. ప్రస్తుత ప్రపంచ పరిస్థితులకు అనుగుణంగా అంతర్జాతీయ

సంస్థల్లో `బహుళపక్ష సంస్కరణలు` చేపట్టాల్సిన ఆవశ్యకతను ఈ సందర్భంగా జైశంకర్ తెలియజేశారు. మ్యూనిక్ భద్రతా సదస్సు ఛైర్మన్ వోల్ఫ్‌గ్యాంగ్ ఇషింగర్‌తో కేంద్రమంత్రి ప్రత్యేకంగా సమావేశమయ్యారు. వివిధ అంతర్జాతీయ అంశాలపై భారత్ దృక్పథాన్ని వివరించడానికి, ప్రపంచ సవాళ్లపై పరస్పర అభిప్రాయాలను పంచుకోవడానికి ఈ సదస్సు ఒక అద్భుతమైన వేదికగా నిలిచిందని ఆయన సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా పేర్కొన్నారు. సదస్సు విరామ సమయంలో రొమేనియా విదేశాంగ మంత్రి ఓనా-సిల్వియా తోయుతో జైశంకర్ భేటీ అయ్యారు.

= = = = = = = = = = = = = = = = = = = =

దేశంలోని పట్టణ మౌలిక వసతులను అంతర్జాతీయ ప్రమాణాలతో తీర్చిదిద్దేందుకు లక్ష కోట్ల రూపాయల వ్యయంతో `అర్బన్ ఛాలెంజ్ ఫండ్`-UCF ఏర్పాటుకు కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ఈ నిర్ణయంపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ హర్షం వ్యక్తం చేస్తూ.. ఇది భారత నగరాల రూపురేఖలను మార్చడంతో పాటు.. దేశ ఆర్థిక వృద్ధిలో కీలక చోదకశక్తిగా మారుతుందని సామాజిక మాధ్యమం వేదికగా పేర్కొన్నారు. కేంద్ర గృహ నిర్మాణ, పట్టణ వ్యవహారాల మంత్రిత్వ శాఖ పర్యవేక్షణలో సాగే ఈ పథకం ద్వారా పట్టణ రంగంలో రాబోయే ఐదేళ్లలో ఏకంగా 4 లక్షల కోట్ల రూపాయల పెట్టుబడులు వస్తాయని అంచనా. ఈ విప్లవాత్మక నిర్ణయం ద్వారా కేవలం నిధులు కేటాయించడమే కాకుండా.. బాధ్యతాయుతమైన పాలన, పౌర కేంద్రీకృత సంస్కరణలకు పెద్దపీట వేయనున్నట్లు ప్రధాని స్పష్టం చేశారు.

= = = = = = = = = = = = = = = = = = = =

ఉత్తరాఖండ్‌లోని రుద్రప్రయాగ జిల్లాలో కొలువైన 11వ జ్యోతిర్లింగం.. కేదారినాథ్ ఆలయ ద్వారాలను ఈ ఏడాది ఏప్రిల్ 22న తెరవనున్నట్లు ఆలయ కమిటీ ప్రకటించింది. మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ఈరోజు ఉఖిమఠ్‌లోని ఓంకారేశ్వర ఆలయంలో పంచాంగ గణనలు నిర్వహించి ఈ ముహూర్తాన్ని ఖరారు చేశారు. కేదారినాథుని పంచముఖి డోలీ యాత్ర ఏప్రిల్ 19న ఉఖిమఠ్ నుంచి ప్రారంభమై.. 21న కేదార్‌ధామ్‌కు చేరుకుంటుంది. అనంతరం 22వ తేదీ ఉదయం 8 గంటలకు సంప్రదాయబద్ధంగా, వేద మంత్రోచ్చారణల మధ్య ఆలయ ద్వారాలను భక్తుల దర్శనార్థం తెరవనున్నారు.

= = = = = = = = = = = = = = = = = = = =

బంగ్లాదేశ్ నూతన ప్రధానమంత్రిగా ఎన్నికైన బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ (బీఎన్పీ) ఛైర్మన్ తారిఖ్ రెహ్మాన్ ప్రమాణ స్వీకారోత్సవానికి భారత్ తరఫున లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా హాజరుకానున్నారు. ఈనెల 17న ఢాకాలో జరగనున్న ఈ కీలక వేడుకలో ఆయన పాల్గొంటారని విదేశాంగ మంత్రిత్వ శాఖ ఈరోజు వెల్లడించింది. ఈ ప్రమాణస్వీకారోత్సవంలో స్పీకర్ పాల్గొనడం భారత్-బంగ్లాదేశ్ ప్రజల మధ్య ఉన్న లోతైన, శాశ్వతమైన స్నేహసంబంధాలకు నిదర్శనమని ఆ శాఖ పేర్కొంది.

= = = = = = = = = = = = = = = = = = = =

ప్రముఖ సామాజిక సంస్కర్త సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతిని పురస్కరించుకుని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆయనకు ఈరోజు నివాళులర్పించారు. ఈ మేరకు ప్రధాని సామాజిక మాధ్యమం వేదికగా ఒక సందేశాన్ని పంచుకున్నారు. సంత్ సేవాలాల్ మహారాజ్ తన జీవితాంతం సత్యం, అహింస, ఉన్నతమైన నైతిక విలువల సందేశాన్ని ప్రచారం చేస్తూ.. సమాజంలో నూతన చైతన్యాన్ని నింపారని కొనియాడారు.

= = = = = = = = = = = = = = = = = = = =

ఐసీసీ పురుషుల టీ-20 ప్రపంచ కప్‌లో భాగంగా భారత్ - పాకిస్థాన్ పోరుకు కొలంబోలోని ఆర్.ప్రేమదాస స్టేడియం వేదికైంది. గ్రూప్-ఏ లో భాగంగా జరుగుతున్న ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచిన పాకిస్థాన్ ముందుగా ఫీల్డింగ్ ఎంచుకుంది. బ్యాటింగ్ ప్రారంభించిన భారత్ 18 ఓవర్లకు 4 వికెట్లు కోల్పోయి 154 పరుగులు చేసింది.

అంతకుముందు చెన్నైలో జరిగిన మ్యాచ్‌లో అమెరికా జట్టు 31 పరుగుల తేడాతో నమీబియాపై విజయాన్ని అందుకుంది. మరోవైపు ముంబైలోని వాంఖడే స్టేడియంలో జరిగిన మ్యాచ్‌లో నేపాల్‌ను ఓడించిన వెస్టిండీస్.. ఈ టోర్నీలో సూపర్-8 దశకు చేరుకున్న తొలి జట్టుగా రికార్డు నమోదు చేసింది.

= = = = = = = = = = = = = = = = = = = = =

= = = = = = = = = = = = = = = = = = = = =